సాక్షి జగిత్యాల

మంగళవారం। 13। ఫిబ్రవరి। 2024



సమస్యలు పరిష్కరించాలి

మల్లాపూర్: మోడల్ స్కూల్ అధ్యాపకుల సమస్యలు పరిష్కరించాలని ఎంఎస్‌టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అందె సురేందర్ అన్నారు. అధ్యాపకులతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.



రాజన్నకు జనహారతి

వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం 45వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
32.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. ఉక్కపోత అధికం అవుతుంది.

న్యూస్‌రీల్

గద్దర్ విగ్రహం ఏర్పాటుకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న అతిథులు, కళాకారులు

కథలాపూర్(వేములవాడ): ప్రజలను చైతన్యం చేయడంలో గద్దర్ పాటలు కీలకంగా మారాయని సామాజిక తెలంగాణ ధూంధాం రాష్ట్ర అధ్యక్షుడు మారంపెల్లి రవీందర్ అన్నారు. మండలంలోని భూషణరావుపేటలో గద్దర్ విగ్రహం ఏర్పాటుకు సోమవారం భూమిపూజ చేశారు. కళాకారులు, ప్రజాసంఘాల నాయకులు పాటలు పాడుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం గద్దర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. గద్దర్ జయంతి ఉత్సవాల రాష్ట్ర కో–ఆర్డినేటర్ అంతడుపుల నాగరాజు, ఓయూ జేఏసీ నాయకులు బూసిపాక గణేశ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు యాగండ్ల రమేశ్‌గౌడ్, ప్రజాసంఘాల నాయకులు, ఎంపీటీసీ కొండ ఆంజనేయులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి క్రీడలకు పెగడపల్లి విద్యార్థి



విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పెగడపల్లి: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పెగడపల్లి జెడ్పీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న కంది యోగేశ్ ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు రమేశ్ తెలిపారు. ఇటీవల జిల్లాలోని మెట్‌పల్లిలో నిర్వహించిన జిల్లాస్థాయిలో పోటీల్లో 600 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని ప్రతిభ కనబర్చాడని పేర్కొన్నారు. ఈనెల 16, 17, 18 తేదీల్లో గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. యోగేశ్‌ను హెచ్‌ఎం లలిత, పీఈటీ రమేశ్, ఉపాధ్యాయులు అభినందించారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

జగిత్యాల: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 16న దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. జిల్లాకేంద్రంలోని యూనియన్ కార్యాలయంలో సోమవారం గోడపత్రికను ఆవిష్కరించారు. కేంద్రప్రభుత్వం కార్మికవర్గాన్ని పూర్తిగా విస్మరిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన పథకాలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఇందూరి సులోచన, చంద్రయ్య, శేఖర్, సలీం, హరీశ్, మహ్మద్, లక్ష్మణ్, వికాస్ పాల్గొన్నారు.

సామూహిక కుంకుమార్చనలు



ధర్మపురిలో మహిళల కుంకుమార్చనలు

ధర్మపురి: ధర్మపురి పుణ్యక్షేత్రం గోదావరి ఒడ్డున్న శ్రీమార్కండేయస్వామి ఆలయంలో సోమవారం మహిళలు సామూహిక కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి జయంతి ఉత్సవాల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. ముందుగా స్వామివారికి మహారుద్రాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో సహపంక్తి భోజనాలు చేశబూరు. మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, ఏఎంసీ చైర్మన్ అయ్యోరి రాజేశ్, పట్టణ అధ్యక్షుడు నక్క రాజేందర్, ప్రధాన కార్యదర్శి కొంక వరప్రసాద్, ఉపాధ్యక్షుడు వేముల నరేష్ తదితరులున్నారు.

డీఆర్‌డీవోగా సంపత్‌రావు

జగిత్యాల: జిల్లాలో పనిచేస్తున్న పలువురు అధికారులను బదిలీచేస్తూ ప్రిన్సిపల్ సెక్రటరి సందీప్‌కుమార్ సుల్తానియా ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల డీఆర్డీవోగా పనిచేస్తున్న నరేశ్‌ను జయశంకర్ భూపాలపల్లికి.. వరంగల్ డీఆర్డీవోగా పనిచేస్తున్న సంపత్‌రావును జగిత్యాలకు బదిలీ చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. అలాగే రాజన్న సిరిసిల్ల జిల్లాలో అడిషనల్ డీఆర్డీవోగా పనిచేస్తున్న మదన్‌మోహన్‌ను జగిత్యాల అదనపు డీఆర్డీవోగా నియమించారు. రాజన్న సిరిసిల్ల జెడ్పీ సీఈవోగా పనిచేస్తున్న బొమ్మెన గౌతంరెడ్డిని జగిత్యాల జెడ్పీ సీఈవోగా బదిలీ చేశారు.

లీజు.. తాకట్టు

మాయమాటలతో కనికట్టు





నిందితురాలు(ఫైల్)

- 'బండి రాజకుమారి అనే మహిళ మా కారు లీజుకు తీసుకుంది. రెండు నెలలు అద్దె డబ్బులు ఇచ్చింది. మరుసటి నెల నుంచి ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. జీపీఎస్ సహాయంతో కారు ఎక్కడుందో తెలుసుకుని వెళితే మా కారును రూ.50 వేలకు రాజకుమారి తాకట్టు పెట్టిందని తేలింది. డబ్బులు ఇచ్చేవరకూ కారు ఇవ్వబోమని తాకట్టు పెట్టుకున్న వ్యక్తి చెబుతున్నాడు. లీజు పేరిట మాకు మోసం జరిగిందని కోరుట్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాం. కేసు నమోదు చేశారు. రాజకుమారి కోసం పోలీసులు వెతుకుతున్నా ప్రయోజనం లేదు..'
- ఇది కోరుట్ల మండలం మాదాపూర్‌కు చెందిన ద్యాగ అనిల్ ఆవేదన. కోరుట్లకు చెందిన మరో ఇద్దరు ఇదే రీతిలో మోసపోయి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- అచ్చు ఇదే రీతిలో మెట్‌పల్లికి చెందిన ఓ వ్యక్తి మోసపోయి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈయనతోపాటు మరొకరు కూడా మోసపోయి పోలీస్‌స్టేషన్‌లో చెప్పుకోలేక.. కారు ఆచూకీ దొరకక సతమతమవుతున్నాడు.
- కరీంనగర్ జిల్లా హుజూరాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి ఆర్నెళ్ల క్రితం ఇదే రీతిలో కారు లీజుకు ఇచ్చాడు. రెండు నెలల అద్దె మాత్రమే ఇచ్చిన సదరు మహిళ ఫోన్ స్విచ్ఛాఫ్ చేసుకుంది. నానా తంటాలు పడి కారు ఆచూకీ కనుక్కుని తాకట్టు పెట్టుకున్న వ్యక్తి నుంచి వాపస్ తెచ్చుకున్నాడు.

- ధర్మపురిలోనూ ఇదే రీతిలో దళితబంధు కింద కారు కొనుగోలు చేసిన ఓ వ్యక్తిని లీజు పేరిట సదరు మహిళ మోసం చేసింది. మోసపోయిన వ్యక్తి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.
- గోదావరిఖనితోపాటు మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట ఠాణాల్లోనూ సదరు మహిళపై కేసులు నమోదు అయినట్లు సమాచారం. ఒకటి, రెండు కాదు.. పదుల సంఖ్యలో కారు లీజు పేరిట మోసాలకు పాల్పడిన మహిళ ఇప్పటికీ పోలీసులకు చిక్కడం లేదు.

కేసు నమోదు చేశాం



రాజకమారి అనే మహిళ కారు లీజు పేరిట తాకట్టు పెట్టి డబ్బులు కాజేసి మోసగించారని మెట్‌పల్లి ఠాణాలో ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. ఆ మహిళపై కేసు నమోదు చేసి ఆచూకీ కోసం గాలిస్తున్నాం. త్వరలోనే పట్టుకుని బాధితులకు న్యాయం చేస్తాం.

– రవీందర్‌రెడ్డి, డీఎస్పీ, మెట్‌పల్లి

- బురిడి కొట్టిస్తున్న కి'లేడి'
- లబోదిబోమంటుదున్న బాధితులు
- పోలీసులకు చిక్కని నిందితురాలు

కోరుట్ల: 'మీ కారు లీజుకిస్తే నెలకు రూ.20 వేలు చొప్పున అద్దె ఇస్తా. కారు బాధ్యత నాది. ప్రభుత్వ శాఖల్లో మీ కారు అద్దెకిస్తా. నెలనెలా డబ్బులు ముట్టజెపుతా..' అని మాయమాటలు చెబుతున్న ఓ కి'లేడీ' వాటిని తాకట్టు పెట్టి అందినకాడికి దోచుకుంటోంది. ఒక్కో కారు మీద రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకు తీసుకుంటోంది. అటు లీజుకిచ్చిన యజమానులకు.. ఇటు పోలీసులకు కూడా దొరకకుండా జాగ్రత్త పడుతోంది. ముఖ్యంగా దళితబంధు కింద వచ్చిన కార్లను టార్గెట్ చేసుకుని ఈ వ్యవహారానికి పాల్పడుతోంది.

దళితబంధు కార్లపై కన్ను..

గత ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం కింద కొత్తగా కార్లు కొనుగోలు చేసిన వారి వివరాలు సేకరించి వారికి రాజకుమారి గాలం వేసినట్లు సమాచారం. కొత్త కార్లు రాగానే వాటిని ప్రభుత్వ డిపార్ట్‌మెంట్లలో అద్దెకు పెడితే ఎక్కువ మొత్తంలో డబ్బులు వస్తాయని, తనకు వివిధ శాఖల అధికారులతో పరిచయాలు ఉన్నాయని, నెలకు రూ.20వేల కిరాయి ఇప్పిస్తానని నమ్మబలుకుతుంది. ఆ తరువాత కారు యజమానులతో లీజు అగ్రిమెంట్ చేసుకుని కారు ఆర్సీ పేపర్లు, ఇన్సూరెన్సు ఇతరత్రా ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటుంది. సదరు కారును ప్రభుత్వ శాఖల్లో అద్దెకు ఇచ్చామని చెప్పి రెండు నెలల పాటు అద్దె డబ్బులు ఇస్తుంది. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి కనిపించకుండా పోతోంది. తమకు నెలనెలా రావాల్సిన డబ్బులు రావడం లేదని ఆందోళన చెందిన కార్ల యజమానులు ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఫలితం లేకపోవడంతో చివరికి పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇలా కారు లీజుకు ఇచ్చిన వారిలో దళితబంధు లబ్ధిదారులే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం.

తాకట్టు కనికట్టు..

కారు లీజుకు తీసుకున్నట్లుగా యజమానులతో అగ్రిమెంట్ చేసుకున్న రాజకుమారి ఆ తరువాత కారును అద్దెకు ఇవ్వకుండా ఎవరికో ఒకరికి తాకట్టు పెట్టి రూ.50వేల నుంచి రూ.1.50లక్షల వరకు తీసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. కోరుట్లలో మోసపోయిన వారి కార్లను రికవరీ చేసే క్రమంలో పోలీసులు బాధితులతో కలిసి వరంగల్ జిల్లా రేగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో కార్లు ఉన్నట్లు గుర్తించి అక్కడి వెళ్లినా ఫలితం దక్కలేదు. అక్కడి పోలీసులు సహకరించకపోవడంతో బాధితులు ఉత్తిచేతులతోనే వాపస్ వచ్చినట్లు సమాచారం. సదరు మహిళ తాకట్టు పెట్టిన ఓ కారును కోరుట్ల పోలీసులు రికవరీ చేసి తీసుకువచ్చినా సదరు కారు చాలా మేర దెబ్బతిని ఉండటంతో యజమాని లబోదిబోమన్నాడు. నెల క్రితం మెట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన వ్యక్తి కారు జాడను ఇప్పటికీ పోలీసులు కనిపెట్టలేదు. జగిత్యాల జిల్లాలోనే కాకుండా పలుచోట్ల సదరు కిలేడీపై పోలీసులు కేసులు నమోదు చేసినా ఇప్పటికి ఆమె ఆచూకీ దొరకకపోవడం గమనార్హం.

హుజూరాబాద్ వాసి..

కార్లను లీజుకు తీసుకుని.. తరువాత తాకట్టు పెడుతున్న మహిళ బండి రాజకుమారిని కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ వాసిగా పోలీసులు గుర్తించారు. ఆమె నివాసముండే చోట వివరాలు కోసం ప్రయత్నిస్తే ఎలాంటి సమాచారమూ దొరకడం లేదని తెలిసింది. అక్కడి నుంచి మకాం మార్చి హైదరాబాద్‌లో ఉంటున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. రాజకీయ పలుకుబడి ఉన్న కారణంగానే కొన్నిచోట్ల పోలీసులు ఆమెను తప్పిస్తున్నారని పలువురు బాధితులు ఆరోపిస్తున్నారు. ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో పదుల సంఖ్యలో కారు లీజు పేరిట మోసాలు జరిగినా సదరు మహిళ ఆచూకీ కనిపెట్టకపోవడం గమనార్హం.

ఆలకించండి.. పరిష్కరించండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్

- ప్రజావాణికి తరలివచ్చిన బాధితులు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ యాస్మిన్ బాషా
- పరిష్కారం చూపాలని అధికారులకు ఆదేశం

జగిత్యాల: కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి బాధితులు జిల్లా వ్యాప్తంగా తరలివచ్చారు. వారి నుంచి కలెక్టర్ యాస్మిన్ బాషా అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజావాణి కార్యక్రమానికి వచ్చే సమస్యలకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని, వెంటవెంటనే పరిష్కార మార్గం చూపాలని సూచించారు. వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు అనేక వ్యయప్రయాసాలకోర్చి వస్తారని, వారి ఫిర్యాదులను స్వీకరించి వెంటనే స్పందించాలని అధికారులను ఆదేశించారు. ఏ సమస్యలు కూడా పెండింగ్‌లో ఉంచొద్దని పేర్కొన్నారు. వివిధ సమస్యలపై 37 ఫిర్యాదులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ దివాకర, జగిత్యాల, కోరుట్ల ఆర్డీవోలు నర్సింహమూర్తి, రాజేశ్వర్, హన్మంతరావు ఉన్నారు.

ఉపాధి కల్పించాలి



వెల్లుల గ్రామస్తులు, మెట్‌పల్లి

మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గీత కార్మికుల సహకార సంఘంలో కులవృత్తిని కొనసాగించి ప్రస్తుతం వృద్ధాప్యం.. అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఉపాధి కల్పించాలి. మా సంఘంలో ఉన్న వారు కొందరు తల్లిదండ్రుల మీద ఆధారడుతున్నారు. కేవలం రూ.రెండు వేలు మాత్రమే ఇస్తున్నారు. అవి వైద్యానికి కూడా సరిపోవడం లేదు. సంఘం వారు ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలి. భూములు కేటాయిస్తే ఉపాధి చేసుకుంటాం.

– వెల్లుల గ్రామస్తులు, మెట్‌పల్లి

మా భూములు మాకివ్వండి



వేములకుర్తి గ్రామస్తులు, ఇబ్రహీంపట్నం

మాకు అటవీ, రెవెన్యూ సరిహద్దు మధ్యనున్న భూమికి 38 మందికి పట్టాలు ఇచ్చారు. ఇటీవల వాటిని అటవీశాఖ వారు స్వాధీనం చేసుకుంటున్నారు. దీంతో మా బతుకులు రోడ్డున పడ్డాయి. అధికారులు స్పందించి మా భూములు మాకు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలి. ఇటీవల నూతన పట్టా పాస్‌బుక్కులు కూడా ఇచ్చారు.

– వేములకుర్తి గ్రామస్తులు, ఇబ్రహీంపట్నం

ప్రభుత్వ స్కూల్‌లో ఫీజు అడుగుతున్నారు



జగిత్యాల: ప్రభుత్వ పాఠశాలలో ఫీజు అడుగుతున్నారు. మా పాప ఎండీ.లస్య ప్రభుత్వ పాఠశాలలో మూడో తరగతి చదువుతోంది. పాఠశాలలో ముగ్గురు టీచర్లు ఉన్నారు. మరో నలుగురు ప్రైవేటు టీచర్లను పెట్టి రూ.8,400 ఫీజు అడుగుతున్నారు. ఆ ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నాం. హాల్‌టికెట్ ఇప్పించి పరీక్షలు రాసేలా చర్యలు తీసుకోవాలి.

ఎండీ.అస్మా, కట్కాపూర్, రాయికల్ మండలం

ఎంపీడీవోలకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను సన్మానిస్తున్న జెడ్పీచైర్‌పర్సన్

జగిత్యాలరూరల్: బదిలీ అనేది వ్యక్తికే తప్ప సేవలకు కాదని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో వివిధ జిల్లాలకు బదిలీ అయిన ఎంపీడీవోలను జిల్లా పరిషత్ కార్యాలయంలో సోమవారం సన్మానించారు. ఉద్యోగ సమయంలో ప్రజలకు చేసిన సేవలు చిరకాలం గుర్తుంటాయన్నారు. ఉద్యోగులకు బదిలీలు సాధారణమైన వారు చేసిన పనులు ప్రజల్లో చిరకాలం ఉంటాయన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక తొలి జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా ఎన్నికవడం అదృష్టంగా భావిస్తున్నాని తెలిపారు. తన పాలనలో ఎంపీడీవోల పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రఘువరణ్, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

హాస్టళ్లను విజిట్ చేయాలి

- స్పెషల్ ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలి
- కలెక్టర్ యాస్మిన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్

జగిత్యాల: ప్రత్యేక అధికారులు ప్రతి మంగళవారం హాస్టళ్లను విజిట్ చేయాలని కలెక్టర్ యాస్మిన్ బాషా అన్నారు. సోమవారం ప్రత్యేకాధికారులతో సమావేశమయ్యారు. వెల్ఫేర్ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు వాట్సప్ క్రియేట్ చేసి వాటి వివరాలను ఎప్పటికప్పుడు అందులో పోస్ట్ చేయాలని అధికారులను ఆదేశించారు. వెల్ఫేర్ హాస్టళ్లను తనిఖీ చేసి పిల్లలు ఎలా చదువుతున్నారు..? వసతులు ఉన్నాయా..? లేవా..? అనే రిపోర్ట్ ఇవ్వాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి వారి విద్యాభివృద్ధికి తోడ్పడాలని పేర్కొన్నారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, మోటివేషన్ తరగతులు, విద్యపట్ల అవగాహన కల్పించాలన్నారు. స్పెషల్ ఆఫీసర్లు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు జరుగుతున్న ప్రదేశాలను తనిఖీ చేయాలన్నారు. చిన్నచిన్న విషయాలకే పిల్లలు ప్రాణాలు తీసుకుంటున్నారని, అలా జరగకుండా హాస్టల్స్‌లో అవగాహన కల్పించాలన్నారు. అదనపు కలెక్టర్ దివాకర, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జేఎన్టీయూలో 'ఫైనైట్ ఎలిమెంట్ అనాలసిస్'



వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న వసంత్‌కుమార్

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపల్లి ఇంజినీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఫైనైట్ ఎలిమెంట్ అనాలసిస్ యూజింగ్ అన్సిస్ వర్క్ బెంచ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. మెకానికల్ విభాగాధిపతి కె.వసంత్ కుమార్ మాట్లాడుతే ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి ఏదైనా రియల్ ప్రాడక్ట్‌ను నిజంగా తయారు చేయకుండానే.. దాని మోడల్‌ను ప్రిపేర్ చేసుకుని అది ఎంతవరకు పనిచేస్తుందో తెలుసుకునే అవకాశం ఉందని తెలిపారు. ఏదైనా ప్రొడక్ట్ కచ్చితంగా ఎలా పనిచేస్తుంది..? ఏ మెటీరియల్ వాడాలి..? అనే విధానం సులభంగా తెలుసుకుని కావాల్సిన పరికరాలను తయారు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ కామాక్షి ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ టి.వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వర్క్‌షాప్‌నకు సహకరించిన రిసోర్స్ పర్సన్ రాజమహేంద్ర, సిములేషన్ ఇంజినీరింగ్ (హైదరాబాద్), మెకానికల్ ఫ్యాకల్టీ కో–కన్వీనర్ సురేష్ అర్జుల, కో–ఆర్డినేటర్ బి.నర్సయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

'గృహజ్యోతి' వివరాలు అందించాలి



వివరాలు స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో అధికారులు

సారంగాపూర్: గృహజ్యోతి పథకానికి అర్హత పొందడానికి అర్హులు పూర్తి వివరాలు అందించాలని ట్రాన్స్‌కో డీఈ రాజిరెడ్డి తెలిపారు. మండలంలోని అర్పపల్లి, పెంబట్ల, రేచపల్లిలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బంది చేపడుతున్న వివరాల సేకరణను పరిశీలించారు. 200 యూనిట్లలోపు ఉచితంగా అందించడానికి ఆధార్, రేషన్‌కార్డు, ఇంటిమీటరు బిల్లు వివరాలను అనుసంధానం చేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏడీఈ హరీష్, ఏఈ సతీశ్ ఉన్నారు.

మహిళా హక్కులపై అవగాహన ఉండాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జానకి

జగిత్యాలరూరల్: మహిళలు సాధికారత హక్కులపై అవగాహన పెంచుకోవాలని ఐసీడీఎస్ జగిత్యాల సూపర్‌వైజర్ జానకి అన్నారు. సోమవారం జగిత్యాలరూరల్ మండలం లక్ష్మీపూర్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే పాఠశాల, కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులకు పోక్సో చట్టం, సెల్‌ఫోన్ వాడటం వల్ల వచ్చే ఇబ్బందులు, వారి వ్యక్తిగత వికాసాన్ని పెంపొందించుకునే అంశాలపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ మమత, డీహెచ్‌ఈడబ్ల్యూ టీం కో–ఆర్డినేటర్ అశ్విని, టీం మెంబర్స్ గౌతమి, హేమశ్రీ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అప్పుడే.. అడ్మిషన్ల దందా

- పరీక్షలకు ముందే ప్రచారం షురూ
- నిబంధనలు గాలికి..
- కార్పొరేట్ విద్యాసంస్థల నిర్వాకం
- పీఆర్‌వోలతో ప్రతిరోజూ ఫోన్లు

గొల్లపల్లి: జిల్లాలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి అప్పుడే అడ్మిషన్ల దందాకు తెరలేపాయి. 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఇప్పటినుంచే ప్రక్రియను ప్రారంభించాయి. పదో తరగతి పరీక్షలు కాకముందే పిల్లలను ఇంటర్‌లో తమ కళాశాలలో చేర్పించాలంటూ తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్నాయి. మరీముఖ్యంగా జిల్లా కేంద్రంలోని కొన్ని కార్పొరేట్ విద్యాసంస్థలు ఈ తతంగం కొనసాగిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు కొద్దిరోజుల తరువాత అడ్మిషన్లు ఎక్కడా దొరకవేమోననే అయోమయంతో కళాశాలల్లో చేర్పించేందుకు తొందరపడుతున్నారు.

రెండు నెలల నుంచే..

ప్రైవేట్ విద్యాసంస్థల పీఆర్వోలు జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో రెండు నెలల క్రితమే తిష్టవేశారు. పదో తరగతి పరీక్షలు రాసే విద్యార్థుల పాఠశాలలకు వెళ్తూ యాజమాన్యాలను సంప్రదించి విద్యార్థుల ఫోన్ నంబర్లను సేకరిస్తున్నారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తూ అడ్మిషన్లు తీసుకోవాలని చెబుతున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలతోపాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులను కలుస్తూ వారికి విందులు ఏర్పాటు చేస్తున్నారు. తమ కళాశాలకు అడ్మిషన్లు ఇప్పించాలంటూ వారికి ఆఫర్లు ప్రకటిస్తున్నారు. చదువులో మెరుగ్గా ఉన్నా విద్యార్థుల వివరాలను



ముందే తీసుకుని అవసరమైతే విద్యార్థుల తల్లిదండ్రులను కూడా కలుస్తున్నారు. కొందరు హెచ్‌ఎంలు ప్రైవేట్ విద్యాసంస్థలకు సహకరిస్తున్నారు. ఇటీవల రెండు ప్రధానమైన ఉపాధ్యాయ సంఘాల సభ్యులకు హైదరాబాద్‌కు చెందిన ఓ కార్పొరేట్ విద్యాసంస్థ జిల్లా కేంద్రంతోపాటు, హైదరాబాద్‌లో రెండుసార్లు పెద్దస్థాయిలోనే విందు ఏర్పాటు చేసినట్లు తెలిసింది.

నిబంధనలకు వ్యతిరేకంగా..

అడ్మిషన్ల ప్రక్రియను ముందుగానే చేపట్టడం నిబంధనలకు విరుద్ధమని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. పరీక్షలు పూర్తయి.. ఫలితాలు వెలువడిన తరువాత మే, జూన్‌లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉంది. కానీ కొన్ని కార్పొరేట్ సంస్థలు డిసెంబర్ నుంచే ప్రక్రియను ప్రారంభించాయి. తమ కళాశాలల్లో మెరుగ్గా సౌకర్యాలు ఉన్నాయని ఫలితాలు బాగున్నాయని అడ్మిషన్లు తీసుకోవాలని చెబుతున్నారు. ముందే అడ్మిషన్లు తీసుకుంటే ఫీజులో రాయితీ ఉంటుందని, వివిధ విభాగాల్లో మంచి సీట్లు లభిస్తాయని పేర్కొంటున్నారు. నిబంధనలను గాలికి వదిలి అడ్మిషన్లు తీసుకుంటున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యాశాఖ అధికారులు స్పందించి అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అడ్మిషన్లు చేపట్టరాదు

ప్రైవేట్ విద్యాసంస్థలు నిబంధనలకు విరుద్ధంగా అడ్మిషన్లు చేపట్టరాదు. ప్రైవేట్ కళాశాలల్లో ముందస్తుగా అడ్మిషన్లు చేపడితే మా దృష్టికి తీసుకురావాలి. వెంటనే స్పందించి చర్యలు తీసుకుంటాం. అనుమతి లేని కళాశాలపై చర్యలు ఉంటాయి.

– నారాయణ, డీఐఈవో

క్లుప్తంగా

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



కరీంనగర్‌కల్చరల్: నగరంలోని మార్కెట్‌రోడ్ శ్రీవేంకటేశ్వరస్వామి సప్తమ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 14 నుంచి ప్రారంభమవుతాయి. బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని మినిస్టర్స్ క్వార్టర్స్‌లో రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. ఉత్సవాలను శాస్త్రోక్తంగా ఘనంగా నిర్వహించాలని, వీలును బట్టి ప్రతీ కార్యక్రమంలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆలయ ధర్మకర్తలు చకిలం శ్రీనివాస్, చకిలం గంగాధర్, ఈవో వుడుతల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దొంగను పట్టుకున్న యువకులు



రాయికల్: పట్టణంలో ఓ మహిళ మెడలోంచి పుస్తెల తాడును లాక్కేందుకు యత్నించిన దొంగను కాలనీవాసులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన పడిగెల రాజేశ్.. ఒంటరిగా కనిపించిన మాదాసు లక్ష్మి మెడలోని పుస్తెలతాడును లాక్కెళ్లేందుకు ప్రయత్నించాడు. బాధితురాలు ఒక్కసారిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్న యువకులంతా చేరి దొంగను పట్టుకుని చితకబాదారు. అనంతరం పోలీసులకు అప్పగించినట్లు ఎస్సై అజయ్ తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

వెల్గటూర్: ప్రమాదం బారిన పడి.. చికిత్స పొందుతున్న ఎండపల్లి మండలం గుల్లకోట గ్రామానికి చెందిన పత్రి గంగాధర్ మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. గంగాధర్ (45) ఆర్‌ఎంపీ. ఈనెల 4న బయటకు వెళ్లి రాత్రి సమయంలో తిరిగి ఇంటికొస్తుండగా గుల్లకోట బస్టాండ్ సమీపంలో ఎదురుగా వచ్చిన బైక్ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో ఆయన తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఆయనను హైదరాబాద్‌లోని గాంధీ ఆసుపత్రిలో చేర్పించారు. మృతుడి కుమారుడు రాకేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్వేత తెలిపారు.

దోస్తునే చంపేశాడు

- వేములవాడలో యువకుడి దారుణహత్య
- కత్తితో గొంతుకోసి ఘాతుకం
- పాతకక్షలేనని పేర్కొంటున్న పోలీసులు



ఘటన స్థలంలో శ్రీధర్ మృతదేహం, సెల్‌ఫోన్, మద్యం బాటిల్



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు

వేములవాడ: వాళ్లిద్దరు మంచి దోస్తులు.. ధర్మగుండం వద్ద డ్యూటీ చేయగా వచ్చిన డబ్బులు పంచుకుంటూ నిత్యం మద్యం తాగడం, దావత్ చేసుకోవడం వారి అలవాటు. కలిసే తిరుగుతారు.. కలిసే ఉంటారు.. కానీ అకస్మాత్తుగా వారిలో చిన్న చిన్న తిట్ల పురాణం, పాత కక్షలు మద్యం మత్తులో చెలరేగాయి. దీంతో దోస్తు అని చూడకుండా కత్తితో మెడకోసి దారుణంగా హత్య చేసిన ఘటన సోమవారం వేములవాడలో జరిగింది. పట్టణంలోని ఓల్డ్ అర్బన్‌కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్(26) హత్యకు గురయ్యాడు. మృతుడికి భార్య భాగ్యరేఖ అలియాస్ యామిని, మూడేళ్ల కుమారుడు సిద్ధార్థ నందన్, తండ్రి శ్రీశైలం, తల్లి జ్యోతి ఉన్నారు. ఘటనా స్థలాన్ని ట్రైనీ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ పరిశీలించారు. క్లూస్‌టీం విభాగం వివరాలు సేకరించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బైక్‌పై తీసుకెళ్లి..

శ్రీధర్ హత్యపై కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 10 గంటలకు ఇంటి వద్ద గద్దెపై కూర్చున్న శ్రీధర్‌ను అదే కాలనీకి చెందిన బాబు అనే వ్యక్తి బైక్‌పై తీసుకెళ్లాడు. అప్పటి నుంచి ఉదయం వరకు శ్రీధర్ ఇంటికి రాలేదు. సోమవారం ఉదయం 9.30 గంటలకు పోలీసులు వచ్చి శ్రీధర్ భార్యను జర్మనీ గెస్ట్‌హౌస్ ప్రాంతంలో హత్య జరిగిన ప్రాంతానికి తీసుకెళ్లారు. అక్కడ తన భర్త చనిపోయి ఉన్నాడని భార్య యామిని రోదిస్తూ తెలిపింది.



కుమారుడితో శ్రీధర్ (ఫైల్)

లోకేషన్ సర్చ్ చేశా..: యామిని

తన భర్త శ్రీధర్ ఎక్కడున్నా తెలిసేలా తన మొబైల్‌లో గూగుల్ లొకేషన్ మ్యాప్ సెట్ చేసి ఇచ్చాడని భార్య యామిని తెలిపింది. గతంలోనూ రెండు, మూడుసార్లు మద్యం మత్తులో ఎక్కడో పడుకుని ఉంటే తాను గూగుల్‌లో సర్చ్ చేశానని, ఆదివారం రాత్రి సైతం గూగుల్‌లో సర్చ్ చేయగా బైపాస్‌రోడ్డు ప్రాంతంలో ఉన్నట్లు తెలిసిందని భార్య చెబుతోంది. ఎన్నిసార్లు ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని, బైక్‌పై తీసుకెళ్లిన బాబుకు సైతం ఫోన్ చేసినా లిఫ్ట్ చేయలేదని తెలిపింది. తన భర్తను అన్యాయంగా పొట్టనబెట్టుకున్నాడని రోదించింది. కేవలం మద్యం, గంజాయికి బానిసలైన వ్యక్తులే ఇలా చేస్తున్నారంటూ కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

పాతకక్షలే హత్యకు కారణమా..?

వేములవాడ పట్టణంలోని ఓల్డ్ అర్బన్ కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్ పాత కక్షలకే బలైనట్లు పోలీసులు భావిస్తున్నారు. గతంలో శ్రీధర్ తన మిత్రుడైన బాబు బైక్‌ను తగులబెట్టాడని, అప్పటి నుంచి కక్ష పెంచుకున్న బాబు ఎలాగైనా హతమార్చాలని ప్లాన్ వేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే బాబును, అతడికి సహకరించిన మరికొంత మందిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కాగా దోస్తునే చంపేశాడంటూ వేములవాడ పట్టణంలో ఈ దారుణహత్య కలకలం రేపింది.

మహిళ కడుపులోంచి 15 కిలోల కణతి తొలగింపు

- జగిత్యాల జిల్లా కోరుట్లలో అరుదైన శస్త్ర చికిత్స



తొలగించిన కణతులతో డాక్టర్ స్వీటీ అనూప్

కోరుట్ల: కడుపు నొప్పి.. ఆయాసంతో బాధపడుతున్న ఓ మహిళకు జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఓ నర్సింగ్‌హోంలో శస్త్రచికిత్స చేసి సుమారు 15 కిలోల కణతులను తొలగించారు. పట్టణంలోని డాక్‌బంగ్లా ఏరియాకు చెందిన నాజియా(38) రెండేళ్లుగా కడుపు నొప్పితోపాటు ఆయాసంతో బాధపడుతోంది. ఆమెను బంధువులు మూడు రోజుల క్రితం కోరుట్ల నర్సింగ్‌హోంకు పరీక్షల నిమిత్తం తీసుకొచ్చారు. పరీక్షలు నిర్వహించిన సీనియర్ గైనకాలజిస్టు స్వీటి అనూప్ ఆమె కడుపులో కణతులు ఉన్నట్లు గుర్తించారు. స్థానికంగా శస్త్రచికిత్స కష్టమైనా రోగి ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా సిద్ధమయ్యారు. సోమవారం ఉదయం నాజీయాకు శస్త్రచికిత్స చేసి సుమారు 15కిలోల రెండు కణతులను తొలగించారు. గర్భాశయంలో ఉన్న కణతి 8 కిలోలు.. అండాశయంలో ఉన్న ఏడు కిలోల కణతిగా విజయవంతంగా తొలగించామని డాక్టర్ స్వీటి అనూప్ తెలిపారు. ఒక మహిళ కడుపులో రెండు ప్రాంతాల్లో రెండు కణుతులు అరుదుగా ఉంటాయన్నారు. ఈ అరుదైన ఆపరేషన్‌లో పాలుపంచుకున్న డాక్టర్ అనూప్‌రావు, డాక్టర్ నారాయణ, డాక్టర్ జగదీశ్, థియేటర్ సిబ్బందిని అభినందించారు. నాజీయా ఆరోగ్యంగా ఉందని, మరో నాలుగు రోజుల్లో డిశ్చార్జి చేస్తామని ఆమె తెలిపారు.

'మిలియనీర్ ఫార్మర్' మల్లికార్జున్‌రెడ్డి



అవార్డు స్వీకరిస్తున్న మల్లికార్జున్‌రెడ్డి

చొప్పదండి: మండలంలోని పెద్దకూర్మపల్లి గ్రామానికి చెందిన జాతీయ ఉత్తమ రైతు అవార్డు గ్రహీత మావురం మల్లికార్జున్‌రెడ్డి తాజాగా డిస్ట్రిక్ట్ మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు సొంతం చేసుకున్నారు. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లిలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన రైతు సదస్సు, వ్యవసాయ క్షేత్ర ప్రదర్శనలో ఐకార్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఉద్ధంసింగ్, ఏటీ ఏఆర్‌ఐ డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్ మీర చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. రైతు సదస్సుకు కరీంనగర్ జిల్లా తరఫున హాజరయ్యారు. ఇటీవలే వికసిత్ భారత్ సంకల్ప్ యాత్రలో భాగంగా జిల్లా తరుపున ప్రధాన మంత్రి మోదీతో లైవ్‌లో మాట్లాడారు. కాగా, అవార్డు అందుకోవడం తనకు మరింత సంతోషాన్ని కలిగించిందని మల్లికార్జున్‌రెడ్డి తెలిపారు. సంప్రదాయ, రసాయనాలు లేని, సమీకృత వ్యవసాయం లక్ష్యంగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగం వదిలి స్వగ్రామంలో సేద్యం చేస్తున్న తనకు ఇలా గుర్తింపు వస్తున్నందుకు ఆనందగా ఉందన్నారు.

17న 'భారతరత్నం పీవీ' అంశంపై ప్రసంగం

కరీంనగర్‌కల్చరల్: మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించిన సందర్భంగా నగరంలోని భగత్‌నగర్ బృందావన్‌గార్డెన్‌లో 17న సాయంత్రం 5.30 గంటలకు ప్రజ్ఞాభారతి, పీవీ సాహిత్య పీఠం ఆధ్వర్యంలో 'భారత్ కిరీటంలో మెరిసిన భారతరత్నం' అంశంపై ప్రసంగాన్ని ఏర్పాటు చేసిన ఆయా సంస్థల బాధ్యులు ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎల్.రాజభాస్కరరెడ్డి అధ్యక్షతన జరిగే కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, పీవీ తనయుడు ప్రభాకరరావు, సామాజిక, రాజకీయ విశ్లేషకుడు భాస్కరయోగి, డి.నిరంజనాచారి, కేవీ సంతోష్‌బాబు, ఎలగందుల సత్యనారాయణ, మందల నగేశ్‌డ్డి తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. పీవీ అభిమానులు, కవులు, రచయితలు, నగరవాసులు పాల్గొనాలని కోరారు.

కారు ఢీకొని ఒకరి మృతి

వెల్గటూర్(ధర్మపురి): ఎండపల్లి మండలం కొత్తపేటలో కారు ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపేటకు చెందిన బోగ లచ్చన్న (55) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం తన ఆటోను కొత్తపేట బస్టాండ్‌లో నిలిపి భోజనానికి ఇంటికి వెళ్తుండగా వెల్గటూర్ నుంచి ధర్మారం వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి లచ్చన్నను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించగా ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి మేనల్లుడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో రైతు బలవన్మరణం

వీణవంక(హుజూరాబాద్): మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన రైతు ముష్క సదయ్య (45) ఆర్థిక ఇబ్బందులతో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సదయ్యకు రెండు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. వ్యవసాయంలో అంతంతే దిగుబడులు రాడంతో నష్టపోయాడు. దీనికి తోడు కూతురు వివాహం గురించి ఆలోచించి జీవితంపై విరక్తి చెంది సోమవారం ఉదయం గేదెల పాలు పితికి పొలం వద్దకు వెళ్లాడు. అక్కడే చెట్టుకు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారు గమనించేలోపు మరణించాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని చిన్న కెనాల్ సమీపంలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పోలీసులు పట్టుకున్నారు. పట్టణ ఎస్సై మన్మధరావు వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం చిన్నకెనాల్ సమీపంలో రహస్యంగా పేకాట ఆడుతుండగా పక్కా సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకున్నారు. ఏడు సెల్‌ఫోన్లతో పాటు, రూ.25 వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు మధుసూదన్



కరీంనగర్‌స్పోర్ట్స్: హైదరాబాద్ గచ్చిబౌలిలో ఈనెల 8 నుంచి 11 వరకు జరిగిన 5వ జాతీయస్థాయి మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన సీనియర్ మాస్టర్ అథ్లెట్ మధుసూదన్ ప్రతిభ కనబరిచారు. బంగారు, రజత పతకాలు సాధించి అంతర్జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలకు అర్హత సాధించారు. 5 కిలోమీటర్ల రేస్ వాక్‌లో బంగారు, 400 మీటర్ల రోల్ రన్నింగ్‌లో రజత పతకం సాధించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌ను రాష్ట్ర మాస్టర్స్ అథ్లెట్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మర్రి లక్ష్మారెడ్డి, ప్రభుకుమార్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవీందర్‌రావు, నీలం లక్ష్మణ్, పలువురు అభినందించారు.

బ్యాంకులో షార్ట్ సర్క్యూట్.. చెలరేగిన మంటలు



కరీంనగర్‌క్రైం: నగరంలోని కలెక్టరేట్ ఎదుట గల యూనియన్ బ్యాంకులో సోమవారం మధ్యాహ్నం షార్ట్ సర్క్యూట్‌తో మంటలు చెలరేగాయి. వెంటనే సిబ్బంది, స్థానికులు గమనించి ఫైర్ అధికారులకు సమాచారం అందించగా, వారు వచ్చి మంటలు ఆర్పారు. బ్యాంకులోని స్టోర్ రూములో పలు ఫైల్స్ పాక్షికంగా కాలిపోయినట్లు అధికారులు తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు



ధర్మపురి: ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు విరిగిపోవడంతో గీత కార్మికుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. మండలంలోని కమలాపూర్ గ్రామానికి చెందిన కొండ సత్తన్న తాటి, ఈత చెట్లపై జీవనోపాధి పొందుతున్నాడు. రోజువారీలా సోమవారం ఈత చెట్టు ఎక్కి గీస్తుండగా ప్రమాదవశాత్తు చెట్టు విరిగి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలైన సత్తన్నను 108 అంబులెన్సులో జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు.

'దళితబంధు' కోసం సీఎంవోకు వినతి



పోస్టాఫీస్ వద్ద నాయకులు

జమ్మికుంట(హుజూరాబాద్): హుజూరాబాద్ నియోజకవర్గంలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన రెండో విడత దళితబంధు నిధులు విడుదల చేయాలని దళితబంధు సాధన సమితి నాయకులు కోరారు. సోమవారం నాయకులు కొలుగూరి సురేశ్, మంద రాజేశ్, కోలుగూరి నరేశ్, రామంచ రాకేశ్ ఆధ్వర్యంలో లబ్ధిదారుల వివరాలను సీఎంవో కార్యాలయానికి స్పీడ్ పోస్టులో పంపించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రెండో విడత నిధులు మంజూరు కాని లబ్ధిదారులు సుమారు 4,900 మంది ఉండగా.. 3,700 మంది నుంచి ఆధార్‌కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్‌లు, వినతిపత్రం జతపరిచి పోస్ట్ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి, సీఎంవో అధికారులు వెంటనే స్పందించి రెండో విడత నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో అకినపల్లి ఆకర్షన్, నాగరాజు, రక్షిత్, దీపక్, సతీశ్, బండారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

తరగతిగదిలో నాగుపాము

- భయాందోళనతో పరుగులు తీసిన విద్యార్థులు



తరగతిగదిలో నాగుపాము

కోనరావుపేట(వేములవాడ): మండలంలోని కనగర్తి ప్రాథమిక పాఠశాలలో సోమవారం నాగుపాము చొరబడింది. నాలుగో తరగతిగదిలో నాగుపాము చొరబడి ఒక మూలకు పడి ఉంది. ఇది గమనించని విద్యార్థులు రెండు పీరియడ్ల వరకు క్లాస్‌రూమ్‌లోనే ఉన్నారు. తర్వాత ఓ విద్యార్థి గమనించి కేకలు వేయడంతో విద్యార్థులు భయాందోళనలో బయటకు పరుగులు పెట్టారు. పల్లిమక్త పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కాపిల్ల నరేశ్‌ను పిలవగా అతను వచ్చి పామును పట్టుకుని డబ్బాలో వేసుకుని అటవీ ప్రాంతంలో వదిలేశాడు. కాగా పాఠశాల ఆవరణలో చెత్తాచెదారం పేరుకుపోతున్నా, పంచాయతీ సిబ్బంది తీసుకెళ్లడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. చెత్తాచెదారం ఉండడంతోనే పాములు వస్తున్నాయన్నారు.

ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న కాలేజీపై చర్యలు తీసుకోవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న రమేశ్

కరీంనగర్: విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే అడ్మిషన్లు చేస్తున్న కాలేజీలపై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణిలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) ఆధ్వర్యంలో కలెక్టర్ పమేలా సత్పతికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రత్నం రమేశ్ మాట్లాడుతూ, ఈ విద్యా సంవత్సరం పరీక్షలు జరుగుతున్న క్రమంలో జిల్లా కేంద్రంలోని ఓ కార్పొరేట్ కాలేజీ అక్రమంగా ముందస్తు అడ్మిషన్లు చేస్తుందని పేర్కొన్నారు. ఎక్కడో వచ్చిన ర్యాంకులను ఇక్కడ వచ్చినట్టు చూపిస్తూ ఆకర్షణీయమైన హోర్డింగ్‌లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్నారని తెలిపారు. కాలేజీలో కనీస సౌకర్యాలు లేకున్నా కార్పొరేట్ విద్య పేరుతో దోపిడీ చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి సదరు కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నవీన్, సిద్ధు, నరేశ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

కొడుకుకు ఉద్యోగం లేదని బెంగతో తల్లి బలవన్మరణం



రమణ(ఫైల్)

ముస్తాబాద్(సిరిసిల్ల): కుమారుడికి సరైన ఉద్యోగం లేదనే బెంగతో ఓ తల్లి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా.. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. ఏఎస్సై వెంకటరమణ తెలిపిన వివరాలు. మండలంలోని తెర్లుమద్దికి చెందిన పల్లె రమణ(40) ఈనెల 10న ఇంట్లో పురుగుల మందు తాగింది. అపస్మారక స్థితిలో ఉన్న రమణను కుటుంబ సభ్యులు ఎల్లారెడ్డిపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. రమణ కుమారుడు నిఖిల్‌కు సరైన ఉద్యోగం లేదని తరచూ బాధపడుతుండేది. ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడని మదనపడేది. ఈక్రమంలోనే పురుగుల మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. మృతురాలి కుమారుడు నిఖిల్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రైతుబంధు పేరుతో సైబర్ మోసం

- నాచుపెల్లి గ్రామానికి చెందిన ముగ్గురి డబ్బులు మాయం

కొండగట్టు(చొప్పదండి): రైతుబంధు పేరుతో సైబర్ మోసం జరిగింది. కొడిమ్యాల మండలం నాచుపెల్లి గ్రామానికి చెందిన గాజర్ల సౌమ్య కొద్దిరోజుల క్రితం తన కుటుంబ సభ్యుడు చనిపోవడంతో రూ.5 లక్షల రైతుబీమా పొందింది. సోమవారం సాయంత్రం 4 గంటల సమయంలో 98738 22391 నంబర్ నుంచి గుర్తు తెలియని వ్యక్తి ఆమెకు ఫోన్ చేశాడు. రూ.21వేల రైతు బంధు డబ్బులు వచ్చాయని, ఏదైనా ఖాతా నంబర్ ఇస్తే దానికి డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేస్తానని నమ్మబలికాడు. తన కుటుంబం, రైతు బీమా వివరాలు పక్కాగా చెప్పడంతో నిజమని నమ్మింది. ఈక్రమంలో మరో వ్యక్తి ఫోన్ నంబర్ కావాలని సైబర్ మోసగాడు అడగడంతో సౌమ్య తన పక్కనే ఉన్న తాళ్లపల్లి సంధ్య నంబర్ ఇచ్చింది. కాగా, సౌమ్య అకౌంట్‌కు రూ.9వేలు జమ చేశానని, అంతకంటే ఎక్కువ జమకావడం లేదని, మరొకరి ఫోన్ నంబర్ ఇవ్వాలని మోసగాడు నమ్మించాడు. దీంతో సంధ్య తన భర్త సుమన్ నంబర్ ఇచ్చింది. సుమన్ తన యూపీఐ నంబర్ చెప్పగా, సదరు ఖాతాకు డబ్బు ట్రాన్స్‌ఫర్ కావడం లేదని మరో వ్యక్తి ఫోన్‌నంబర్ ఇవ్వాలని కోరడంతో సుమన్ తన పక్కింటి తాళ్లపెల్లి రమేశ్ నంబర్ ఇచ్చాడు. ఈక్రమంలో సంధ్య ఖాతా నుంచి రూ.8,859, సుమన్ ఖాతా నుంచి రూ.18,549, రమేశ్ ఖాతానుంచి రూ.98,000 మాయమయ్యాయి. సైబర్ మోసగాడు తమ పేర్లు, వివరాలు పక్కాగా చెప్పడంతో తాము మోసపోయామని, సైబర్ మోసగాళ్ల చేతుల్లోకి తమ సమాచారం ఎలా వెళ్లిందో తెలియడం లేదని బాధితులు తెలిపారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నా కొడుకును కాపాడండి

- ఆపన్నహస్తం కోసం మాతృమూర్తి ఎదురుచూపులు



గంభీరావుపేట(సిరిసిల్ల): ఓ ప్రమాదం.. ఆ కుటుంబాన్ని రోడ్డున పడేసింది. కుటుంబానికి పెద్దదిక్కుగా నిలిచిన కొడుకును మంచానికే పరిమితం చేసింది. కూలీ పనికి వెళ్తుండగా బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో వెన్నుపూస, మెదడుకు గాయాలై లేవలేని స్థితికి చేరుకున్నాడు. తన కొడుకు ప్రాణాలను కాపాడాలని ఆ నిరుపేద తల్లి వేడుకుంటుంది. గంభీరావుపేట మండలం ముచ్చర్ల గ్రామానికి చెందిన బోనగిరి కృష్ణంరాజు గత నవంబర్ నెలలో బైక్ అదుపుతప్పి గాయపడ్డాడు. హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేరగా రెండు ఆపరేషన్లు చేసి ఇంటికి పంపించారు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో రూ.5లక్షల వరకు అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రిలో వైద్యం చేయించారు. అయినా ఫలితం లేకుండా పోయింది. ఇప్పటికే మంచానికే పరిమితమయ్యాడు. చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో యువకుడి ఆరోగ్య పరిస్థితి రోజురోజుకు క్షీణించిపోతోంది. ప్రస్తుతం రెండు కాళ్లకు, ఎడమ చేతికి స్పర్శ లేదు. ఇంకా వైద్యం చేయించడానికి ఆర్థిక స్థోమత లేదని కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైద్య సహాయం కోసం ఆపన్నహస్తం అందించాలని వేడుకుంటున్నారు. దాతలు స్పందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

సంప్రదించాల్సిన సెల్ నంబర్
95021 42538

రాజన్నకు జనహారతి



వేములవాడ: వేములవాడ రాజన్నను దర్శించుకునేందుకు భారీ సంఖ్యలో భక్తులు తరలివస్తున్నారు. సోమవారం 45వేల మంది భక్తులు రాజన్నను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో ఆర్జిత సేవలు రద్దు చేసి, లఘు దర్శనాలకు అనుమతించారు. భక్తుల ద్వారా రూ.40లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు తెలిపారు. రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య కుటుంబ సభ్యులతో కలసి రాజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు రాజన్న ప్రసాదం అందించి, సన్మానించారు.

